పొంచి ఉన్న ప్రమాదం




మాధవనగర్ ఆర్వోబీ సమీపంలో ప్రమాదకరంగా ఉన్న గుంతలు

- మాధవనగర్ ఆర్వోబీ సమీపంలో ప్రమాదకరంగా గుంతలు
- భయాందోళనలో వాహనదారులు

నిజామాబాద్ రూరల్: నగర శివారులోని మాధవనగర్ ఆర్వోబీ సమీపంలో రోడ్డు పక్కన ఉన్న గుంతలు ప్రమాదకరంగా ఉన్నాయి. దాదాపు పది ఫీట్ల లోతైన గుంతల్లో చెత్తాచెదారం పేరుకుపోవడంతోపాటు, మురికినీరు చేరి అధ్వానంగా మారింది. అలాగే గుంతల చుట్టూ పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగిపోవడంతోపాటు నీటిపై వ్యర్థాలు నిలిచిఉండటంతో ఈ గుంతలు వాహనదారులకు కనిపించకుండా ఉన్నాయి.ఈక్రమంలో రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఆదమరిచి గుంతల్లో పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు.

పట్టించుకోని అధికారులు..

డిచ్‌పల్లి నుంచి నిజామాబాద్ వరకు వెళ్లే రహదారిని ఇటీవల అధికారులు విస్తరించారు. ఈ దారిలోనే ఉన్న మాధవనగర్ రైల్వేగేట్ వద్ద ప్రస్తుతం ఆర్వోబీ పనులు చేపడుతున్నారు. ఆర్వోబీ సమీపంలోనే ఈ గుంతలు ఏర్పడి దాదాపు సంవత్సరకాలం గడుస్తున్నా అధికారులు వీటిని పట్టించుకోవడం లేదు. ఇప్పటికే ఆర్వోబీ పనుల వద్ద రోడ్డుపై ఉన్న గుంతలతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆర్వోబీ పనుల వద్ద ఎలాంటి ప్రమాద సూచికలు ఏర్పాటు చేయకపోవడంపై వాహనదారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. అలాగే ఈ ప్రాంతంలో రాత్రివేళ సరైన లైటింగ్ వ్యవస్థ లేకపోవడంతో అంధకారం నెలకొంటుంది. దీంతో వాహనదారులకు రాత్రివేళ అవస్థలు తప్పడం లేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు పక్కన ఉన్న ప్రమాదకర గుంతలను పూడ్చివేయించాలని, ఆర్వోబీ వద్ద గుంతల రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

గుంతలను పూడ్చాలి..



నిత్యం వేల సంఖ్యలో వాహనాలు ఈరోడ్డు గుండా ప్రయాణిస్తూ ఉంటాయి. రోడ్డు పక్కన ఉన్న గుంతలతో భయపడుతూ ప్రయాణించాల్సి వస్తోంది. అధికారులు స్పందించి వెంటనే గుంతలను పూడ్చివేయించాలి.

–క్యాసారం శ్రీనివాస్‌రెడ్డి, బర్థిపూర్

అధికారులు స్పందించాలి..



మాధవనగర్ రైల్వే ఓవర్ బ్రిడ్జి పనుల సమీపంలో ఉన్న గుంతలు ప్రయాణికులకు శాపంగా మారాయి. ప్రమాదాలు జరుగకముందే అధికారులు స్పందించి గుంతలను పూడ్చివేయించాలి. అలాగే ఆర్వోబీ వద్ద ప్రమాద సూచికలు ఏర్పాటు చేయించాలి.

–ఈగ గంగారెడ్డి, బర్థిపూర్

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం



మాట్లాడుతున్న మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి

మోపాల్(నిజామాబాద్‌రూరల్): రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం తోనే అభివృద్ధి సాధ్యమని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు కుంటుపడ్డాయని నిజామాబాద్ మార్కెట్ కమిటీ చైర్మన్ ముప్ప గంగారెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏడాది కాలంలో మోపాల్ మండలానికి మంజూరైన నిధుల వివరాలను వెల్లడించారు. వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.9.24 కోట్లు మంజూరయ్యాయని తెలిపారు. తాడెంలో చెక్‌డ్యామ్ నిర్మాణానికి రూ.3.57 కోట్లు, న్యాల్‌కల్‌లో సబ్‌స్టేషన్‌కు రూ.2.26 కోట్లు, రాబోయే వేసవిలో తాగునీటి ఎద్దడి నివారణ కోసం ముందస్తుగా రూ.16లక్షలు మంజూరయ్యాయన్నారు. పలు గ్రామాల్లో జీపీ భవనాలు, పీహెచ్‌సీ సబ్ సెంటర్ల నిర్మాణాలకు రూ.20లక్షల చొప్పున నిధులు విడుదల అయ్యాయన్నారు. ఎంఆర్‌సీ భవనానికి రూ.40లక్షలు, మోపాల్‌లో రోడ్డు విస్తరణ, సుందరీకరణకు రూ.11కోట్లతో పనులు చేపడుతున్నామన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ఓర్వలేకనే బీజేపీ, బీఆర్ఎస్ నాయకులు ప్రభుత్వంపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. నాయకులు ఎల్లోల్ల సాయిరెడ్డి, గోర్కంటి లింగం, బోర్గాం శ్రీనివాస్, మోహన్ నాయక్, కిరణ్‌రావు, రాజాకిషన్, శంకర్, రామాగౌడ్, గంగారెడ్డి పాల్గొన్నారు.

క్లుప్తంగా

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ



సుభాష్‌నగర్: నగరంలోని సుభాష్‌నగర్‌లోగల అర్బన్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సోమవారం పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. గతంలో ఏడాది గడిచినా సీఎంఆర్ఎఫ్ చెక్కులు రాలేవని, ప్రస్తుతం 3 నెలల్లోనే చెక్కులు వచ్చేలా కృషి చేస్తున్నామని తెలిపారు. దరఖాస్తు చేసుకున్న 3 నెలల్లో చెక్కులు రావడంపై ఎమ్మెల్యేకు లబ్ధిదారులు కృతజ్ఞతలు తెలియజేశారు. నాయకులు, మండలాల అధ్యక్షులు, మాజీ కార్పొరేటర్లు పాల్గొన్నారు.

మైనర్లు వాహనాలు నడపొద్దు

సిరికొండ: మైనర్లు వాహనాలు నడపొద్దని, వారికి పెద్దలు వాహనాలను ఇవ్వరాదని ఎస్సై రామ్ తెలిపారు. మండలంలోని పందిమడుగు గ్రామంలో సోమవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించారు. ఈసందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రత నియమాలు పాటించాలని సూచించారు. వాహనదారులు మద్యం తాగి వాహనాలను నడపవద్దని తెలిపారు. గంగనర్సయ్య, అంజయ్య, రాజేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఇందల్వాయి అభివృద్ధికి అధిక నిధులు



ఇందల్వాయి: నియోజకవర్గంలో ఇందల్వాయి మండల అభివృద్ధికి ఎమ్మెల్యే భూపతిరెడ్డి అధిక నిధులు కేటాయిస్తున్నట్లు మండల కాంగ్రెస్ అధ్యక్షుడు నవీన్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలో అన్ని శాఖల్లో కలిపి సుమారు 22 కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు జరుగుతున్నట్లు తెలిపారు. నూతనంగా అమలవుతున్న నాలుగు సంక్షేమ పథకాలు సకాలంలో ప్రజలకు అందుతాయన్నారు.నాయకులు సంతోష్‌రెడ్డి, సుధాకర్, కర్సం మోహన్ పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక



నిజామాబాద్ నాగారం: నగరంలోని పద్మశాలి సంఘం మైసమ్మవీధి తర్పనెం 10 నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా దీవన్‌పెల్లి హరిశంకర్, ఉపాధ్యక్షులుగా బొమ్మెర తులసిప్రసాద్, ధ్యావనపల్లి గంగాప్రసాద్, కోశాధికారిగా మదూరి భాస్కర్, ప్రధాన కార్యదర్శిగా సాప మోహన్, సహాయ కార్యదర్శులుగా పల్నాటి మల్లయ్య, దుర్గాప్రసాద్ ఎన్నికయ్యారు. నగర అధ్యక్షుడు గుజ్జెటి వెంకట్‌నర్సయ్య వారితో ప్రమాణస్వీకారం చేయించారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలి



ధర్పల్లి: రాష్ట్ర ప్రభుత్వం సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలని పీఆర్టీయూ నాయకులు కోరారు. కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన ఏకీకృత పెన్షన్ పథకం(యూనిఫైడ్ పెన్షన్ స్కీమ్)లో రాష్ట్ర ప్రభుత్వం చేరవద్దన్నారు. ఈమేరకు సోమవారం ఎంపీడీవో బాలకృష్ణ, డిప్యూటీ తహసీల్దార్ ప్రవీణ్‌కు వారు వినతిపత్రాన్ని అందజేశారు.పీఆర్టీయూ మండల అధ్యక్షుడు వెంకటరాజారెడ్డి, జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు అంకం నరేష్, సతీష్, రవిరాజ్, సంతోష్, ఠాకూర్, దేవదాస్ పాల్గొన్నారు.

నిధి ఆప్కే నికట్



డిచ్‌పల్లి: మండలంలోని బర్ధిపూర్ శివారులోగల మహీంద్రా షోరూంలో సోమవారం నిజామాబాద్ జిల్లా పీఎఫ్ కార్యాలయ అధికారులు నిధి ఆప్కే నికట్ కార్యక్రమం నిర్వహించారు. పీఎఫ్ చందాదారులు, పెన్షనర్ల సమస్యలు, ఫిర్యాదులను పీఎఫ్ అకౌంట్ ఆఫీసర్ సీహెచ్‌వీ శ్రవణ్‌కుమార్, మేనేజర్ సురేందర్ స్వీకరించి, అక్కడికక్కడే పరిష్కరించారు. ప్రతి నెలా 27న నిధి ఆప్కే నికట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తారని షోరూం, కంపెనీల యజమానులు, పీఎఫ్ చందాదారులు, పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు. అధికారులు బాలనాథ్, ప్రవీణ్‌లాల్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ట్రాఫిక్ ఏసీపీ నారాయణ, పాల్గొన్న యువకులు

నిజామాబాద్ నాగారం: ప్రతిఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని, దీంతో రోడ్డు ప్రమాదాలను పూర్తిగా అరికట్టవచ్చని నిజామాబాద్ ట్రాఫిక్ అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ నారాయణ అన్నారు. నగరంలో సోమవారం మేరా యువ భారత్, నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో 'రోడ్డు భద్రత అవగాహన కార్యాశాల' నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా విచ్చేసి, మాట్లాడారు. ప్రస్తుతం జరుగుతున్న రోడ్డు ప్రమాదాలకు కారణం ట్రాఫిక్ నిబంధనలు పాటించకపోవడం, తగిన జాగ్రత్తలు వహించకపోవటమేనని అన్నారు. రోడ్డు భద్రత–ప్రమాదాల నివారణ విషయంలో నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో కార్యశాల నిర్వహించడం అభినందనీయమన్నారు.

జిల్లా యువజన అధికారిని శైలిబెల్లాల్ మాట్లాడుతూ.. యువతకు హక్కులతోపాటు బాధ్యతలు కూడా తెలియాల్సిన అవసరం ఉందన్నారు. శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న వలంటీర్లకు టీషర్టులు, ప్రశంసా పత్రం, డైరీ, పెన్నును ఉచితంగా అందజేశారు. వివిధ గ్రామాలకు చెందిన యువకులు, ట్రాఫిక్ పోలీస్ సిబ్బంది, నెహ్రూ యువ కేంద్ర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

వీసీల నియామకంలో కేంద్రం జోక్యం సరికాదు



తెయూ(డిచ్‌పల్లి): యూనివర్సిటీల వీసీల నియామకంలో కేంద్ర ప్రభుత్వ జోక్యం సరికాదని, వీసీలను నియమించే అధికారాన్ని గవర్నర్లకు కట్టబెట్టాలనే నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జాతీయ సమితి సభ్యులు రఘురాం డిమాండ్ చేశారు. ఈమేరకు తెలంగాణ యూనివర్సిటీ ఆర్ట్స్‌అండ్‌సైన్స్ కాలేజ్ వద్ద ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. రఘురాం మాట్లాడుతూ.. యూజీసీ ముసాయిదా మార్గదర్శకాలకు వ్యతిరేకంగా ఉద్యమించడానికి విద్యార్థులు సమాయత్తం కావాలని ఆయన పిలుపునిచ్చారు. జిల్లా అధ్యక్షురాలు అంజలి, నాయకులు నవీన్, సాయి, చందు, సంజయ్, గౌతమ్, దినేష్, రవీందర్ పాల్గొన్నారు.

ఐక్యత సభను జయప్రదం చేయాలి



తెయూ(డిచ్‌పల్లి): ఖమ్మంలో ఈ నెల 28న జరిగే పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యవర్గ ఐక్యత సభను జయప్రదం చేయాలని తెలంగాణ యూనివర్సిటీ పీడీఎస్‌యూ నాయకులు అక్షయ్ పిలుపునిచ్చారు. తెయూ ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజ్ వద్ద సోమవారం ఆయన ఐక్యత సభ కరపత్రాలను ఆవిష్కరించారు. అక్షయ్ మాట్లాడుతూ.. నిన్నటి వరకు విడివిడిగా కొనసాగిన రెండు పీడీఎస్‌యూ సంస్థలు నేడు ఐక్యమవ్వడాన్ని విద్యార్థులు హర్షిస్తున్నట్లు తెలిపారు. తెయూ పీడీఎస్‌యూ నాయకులు దేవిక, బిందు, నిఖిల్, రాజేందర్, ఆకాష్ పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ శ్రేణుల సంబురాలు



నిజామాబాద్ అర్బన్: నగరంలోని ఆర్‌అండ్‌బీ గెస్ట్ హౌజ్‌లో సోమవారం ఎమ్మార్పీఎస్ శ్రేణులు, ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం ప్రతినిధులు సంబురాలు నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ జాతీయ అధ్యక్షుడు మందకృష్ణ మాదిగకు పద్మశ్రీ పురస్కారం రావడంపై వారు కేక్ కట్ చేసి, హర్షం వ్యక్తం చేశారు. ఎస్సీ, ఎస్టీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు రమేష్, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు సరికెల పోశెట్టి, మాదిగ ఉద్యోగుల సంఘం నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికం

వైభవంగా శివపార్వతుల కల్యాణం



నిజామాబాద్ రూరల్: నగరంలోని వినాయక్‌నగర్ బస్వాగార్డెన్‌లో ఇందూర్ భక్త బృందం కమిటీ ఆధ్వర్యంలో ఏడు రోజులుగా బ్రహ్మశ్రీ ఫణతుల మేఘరాజ్ శర్మ వారిచే శివ పురాణ ప్రవచనలు నిర్వహించారు. సోమవారం చివరిరోజు సందర్భంగా శివపార్వతుల కల్యాణోత్సవం వైభవంగా నిర్వహించారు. వేడుకల్లో అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. శివపార్వతుల ధాంపత్య జీవనం అందరికీ ఆదర్శం అన్నారు. అనంతరం మహా అన్నదానం కార్యక్రమంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ఆగమయ్య గురుస్వామి, చెన్న గంగరత్నం, పార్శి రాజు, ఎంసాని రవి, లఖిశెట్టి శ్రీనివాస్ భక్తులు తదితరులు పాల్గొన్నారు.

గోమాతకు విద్యారణ్య భారతీస్వామి పూజలు



సుభాష్‌నగర్: నగరంలోని అమ్మనగర్ (అమ్మవెంచర్)లో నిర్మించబోయే వారాహీ మాతా ఆలయ ప్రాంగణంలోని గోశాలను హంపీ విరూపాక్ష విద్యారణ్య పీఠాధీశ్వరులు విద్యారణ్య భారతీ స్వామి సోమవారం సందర్శించారు. ఈసందర్భంగా గోవులకు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆలయ పరిసరాలను పరిశీలించారు. ఆలయ కమిటీ ప్రతినిధి మంచాల జ్ఞానేందర్ తదితరులు ఉన్నారు.

ఎమ్మెల్యేలకు ఆహ్వాన పత్రాల అందజేత

వారాహీ మాతా ఆలయ శంకుస్థాపన ఆహ్వాన పత్రాలను మంచాల శంకరయ్య చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్, ఆలయ కమిటీ ప్రతినిధి మంచాల జ్ఞానేందర్ నిజామాబాద్ అర్బన్, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యేలు ధన్‌పాల్ సూర్యనారాయణ, భూపతిరెడ్డికి అందజేశారు. ఫిబ్రవరి 10న ఆలయ శంకుస్థాపన కార్యక్రమానికి హాజరుకావాలని ఆయన వారిని ఆహ్వానించారు.

సిరికొండ మండలానికి రూ.14.30 కోట్ల నిధులు



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

సిరికొండ: మండలంలో వివిధ అభివృద్ధి పనులకు రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి రూ.14.30 కోట్ల నిధులను మంజూరు చేయించారని కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బాకారం రవి తెలిపారు. మండల కేంద్రంలో సోమవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. లొంక రామలింగేశ్వరస్వామి ఆలయానికి వెళ్లే మార్గంలో హైలెవల్ బ్రిడ్జి నిర్మాణానికి రూ. 3కోట్లు, గడ్కోల్ కప్పలవాగుపై చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.2.46 కోట్లు, తాటిపల్లిలో 33/11 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణానికి రూ. 2.50 కోట్లు, చీన్యానాయక్ తండాకు బీటీ రోడ్డు నిర్మాణానికి రూ.1.26కోట్లు, తూంపల్లి వద్ద వాగుపై చెక్‌డ్యాం నిర్మాణానికి రూ.68లక్షలు, వివిధ గ్రామాల్లో సీసీ రోడ్లు, అంగన్‌వాడీ భవనాలు, గ్రామ పంచాయతీ భవనాలు, సీసీ డ్రైనేజీల నిర్మాణాలకు నిధులు మంజూరైనట్లు తెలిపారు. డీసీసీ కార్యదర్శి ఎర్రన్న, నర్సారెడ్డి, దేగాం సాయన్న, మోజీరం, సురేష్‌రెడ్డి, జీవన్‌నాయక్, ఆసిఫ్, దేవరాజు, నర్సింగ్, రమేష్, సామేల్, సంతోష్‌నాయక్, దిగంబర్ తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తం

దరఖాస్తుల ఆహ్వానం

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని ఆదర్శ (మోడల్) పాఠశాలలో 6వ తరగతి ప్రవేశ పరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ దశరథ్ ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే 7, 8, 9, 10వ తరగతులలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి సైతం దరఖాస్తు చేసుకోవాలని ఆయన తెలిపారు. ఆసక్తి, అర్హత గలవారు ఫిబ్రవరి 28లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. అభ్యర్థులకు ఏప్రిల్ 13న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు.

ఘన్‌పూర్ హెల్త్ సెంటర్ నిర్మాణ పనులకు భూమిపూజ



డిచ్‌పల్లి: మండలంలోని ఘన్‌పూర్‌లో హెల్త్ సెంటర్ నిర్మాణ పనులకు సోమవారం సొసైటీ డైరెక్టర్ సతీష్‌రెడ్డి, వీడీసీ సభ్యులు భూమిపూజ నిర్వహించారు. కాంగ్రెస్ నాయకులు షాదుల్లా, రామకృష్ణ, లింబాద్రి, గంగి భూపతి, రాజేందర్, హరీష్, లక్ష్మీ, గ్రామ పంచాయతీ కార్యదర్శి రమేష్ పాల్గొన్నారు.

డిచ్‌పల్లి ఎస్సైకి అభినందన



డిచ్‌పల్లి: గణతంత్ర దినోత్సవ వేడుకల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు చేతుల మీదుగా ఉత్తమ అవార్డు (ప్రశంసా పత్రం) అందుకున్న డిచ్‌పల్లి ఎస్సై ఎండీ షరీఫ్‌ను సోమవారం సీఐ మల్లేష్ ప్రత్యేకంగా అభినందించారు. అవార్డులు మరింత బాధ్యతలను పెంచుతాయని ఆయన పేర్కొన్నారు. రెండో ఎస్సై సత్యం, సిబ్బంది సైతం ఎస్సైను అభినందించి, శుభాకాంక్షలు తెలియజేశారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



సిరికొండ: మండలంలోని హుస్సేన్‌నగర్ గ్రామంలో పలువురికి సీఎంఆర్ఎఫ్ చెక్కులను కాంగ్రెస్ నాయకులు సోమవారం పంపిణీ చేశారు. నాయకులు మల్లేష్‌యాదవ్, గంగారెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందజేత



ధర్పల్లి: మండలంలోని హోన్నాజీపేట్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు వర్ష, అంజన జిల్లాస్థాయి ఆంగ్ల ఉపన్యాస పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈసందర్భంగా సోమవారం వారికి అంబేడ్కర్ గల్ఫ్ బ్యాంక్ సొసైటీ ఆధ్వర్యంలో రూ.5వేల నగదు ప్రోత్సాహకాన్ని అందజేశారు. అనంతరం విద్యార్థులను ఘనంగా సన్మానించారు. అలాగే పాఠశాలలో వాటర్ ఫిల్టర్ కోసం సొసైటీ వారు రూ.5వేలను అందజేశారు.

ఇందిరమ్మ ఇళ్లపై ఫిర్యాదు



ఇందల్వాయి: మండలంలోని మల్లాపూర్ గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల కేటాయింపులో అవకతవకలు జరిగాయని ఆరోపిస్తూ బాధితులు సోమవారం కలెక్టర్‌కి ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. గ్రామస్తులు పెద్దొల్ల కవిత, చిన్నమ్మ, కలిగొట జమున, నడ్కుడ లక్ష్మి, నాగులపల్లి లత, దగ్గి చిన్నమ్మ తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులకు సన్మానం

నిజామాబాద్ సిటీ: నగరంలోని 37వ డివిజన్‌లో పనిచేస్తున్న మున్సిపల్ పారిశుధ్య కార్మికులను సోమవారం కాలనీలోని వీరసావర్కర్ యూత్ అసోసియేషన్, జైమాత యూత్ అసోసియేషన్ సభ్యులు సన్మానించారు. కార్మికుల సేవలను ప్రశంసించారు. మాజీ కార్పొరేటర్ సహదేవ్, బొట్టు వెంకటేష్, టింటు శీను, రామేశ్వర్,పండు, సంతోష్, మాస కుమార్, సుంకేటి, శంకర్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

నిజామాబాద్‌రూరల్: నగరంలోని కేసీఆర్ కాలనీ చౌరస్తాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు సమాచారం. చౌరస్తాలో రోడ్డు దాటుతున్న వృద్ధుడు వెంకటరత్నంను కారు ఢీకొనడంతో అతడికి గాయాలయ్యాయి. స్థానికులు గమనించి వెంటనే అతడిని చికిత్స నిమిత్తం స్థానిక ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది.

డీటీఎఫ్ క్యాలెండర్ ఆవిష్కరణ

బోధన్: పట్టణంలోని ఆజాంగంజ్ జీహెచ్ఎస్‌లో సోమవారం డీటీఎఫ్ (డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్) క్యాలెండర్‌ను రాష్ట్ర ఉపాధ్యక్షుడు శంతన్ ఆవిష్కరించారు. అలాగే పట్టణం, మండలంలోని పలు ప్రభుత్వ బడుల్లో సంఘ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని చేపట్టారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ విద్యారంగ పటిష్టతకు ప్రభుత్వం చర్యలు చేపట్టాలన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	82,400	వెండి(కిలో)	94,800
22 క్యారెట్స్	76,035		- నిజామాబాద్ బిజినెస్

మాంసం ధరలు

చికెన్	ధరలు (కిలోకు)		
		డ్రెస్డ్	200
		లైవ్	160
స్కిన్‌లెస్	240	మటన్	800

కూరగాయల ధరలు(రూ.)

	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	8	15	గాజరుగడ్డ	40	60
బెండకాయ	40	80	పచ్చిమిర్చి	35	60
బీరకాయ	50	90	దోసకాయ	30	50
దొండకాయ	35	50	ఆలుగడ్డ	20	40
బీర్నిసుకాయ	40	60	గోబిగడ్డ	10	20
కాకరకాయ	30	50	గోబిపువ్వు	20	40
వంకాయ	30	50	బీట్‌రూట్	30	50
పాలకూర	15	30	కరివేపాకు	60	100
మెంతికూర	15	30	చామగడ్డ	40	80
కొత్తిమీర	10	20	గోరుచిక్కుడు	40	80
పుదీనా	40	80	చిక్కుడుకాయ	40	80
క్యాప్సికం	40	60			

- సుభాష్‌నగర్

విద్యార్థులకు బహుమతుల అందజేత



మోపాల్(నిజామాబాద్‌రూరల్): కెనడా నుంచి వెలువడే అంతర్జాతీయ మాస పత్రిక 'గడుగ్గాయి' ఆధ్వర్యంలో ఇటీవల నిర్వహించిన కవితల పోటీల్లో సిర్పూర్ జెడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈసందర్భంగా సంస్థ వారు విద్యార్థులకు పంపించిన సర్టిఫికెట్లు, నగదు బహుమతులను హెచ్ఎం సత్యనారాయణ అందజేశారు. కవితల పోటీలకు శిక్షణనిచ్చిన తెలుగు ఉపాధ్యాయుడు కాసర్ల నరేష్‌రావును హెచ్ఎం అభినందించారు. విద్యార్థులు రచన రెండు ప్రథమ బహుమతులు, అక్షయ ప్రథమ బహుమతి, మాధురి, మేఘన, సుశాంత్ ప్రోత్సాహక బహుమతులు అందుకున్నారన్నారు. ఉపాధ్యాయులు శ్యామల, మోహన్, వందన, గాయత్రి, అక్బర్ బాషా, డాక్టర్ హజారే శ్రీనివాస్, లలిత, తదితరులు పాల్గొన్నారు.

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లిష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

- స్క్రీన్-1: సంక్రాంతికి వస్తున్నాం(తెలుగు)-11.00, 1.30, 4.30, 7.20, 10.00
- స్క్రీన్-2: ఐ డెంటిటీ(తెలుగు)-01.30; డాకు మహారాజు(తెలుగు)-4.30,10.20; గేమ్ ఛేంజర్(తెలుగు)-7.20
- స్క్రీన్-3: స్కైయ్ ఫోర్స్(హిందీ)- 11.00, 1.35, 7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

- స్క్రీన్-1: సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)-10.00, 1.00,4.00, 7.00, 10.00
- స్క్రీన్-2: స్కైయ్ ఫోర్స్(హిందీ)-10.50, 1.35, 7.25, 10.10; డాకు మహారాజు (తెలుగు)- 4.20
- స్క్రీన్-3: తొలిమనసు(తెలుగు)-11.05; గాంధీ తాత చెట్టు(తెలుగు)-2.10 8.00; గేమ్ ఛేంజర్(తెలుగు)- 4.40; హత్య(తెలుగు)-10.30
- స్క్రీన్-4: డియర్ కృష్ణ(తెలుగు)-11.00; ఐ డెంటిటీ(తెలుగు)-1.45; హాంగ్‌కాంగ్ వారియర్స్(తెలుగు)-5.00; డాకు మహారాజు(తెలుగు)-7.20; పుష్ప-02(తెలుగు)-10.25

- లలితామహల్: గేమ్ ఛేంజర్(తెలుగు)
- దేవి: డాకు మహారాజు(తెలుగు)
- నటరాజ్: స్కైయ్ ఫోర్స్(హిందీ)
- విజయ్: సంక్రాంతికి వస్తున్నాం (తెలుగు)